గురువారం హైదరాబాద్ నగరంలోని మొఘల్‌పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద బారులు తీరిన స్థానికులు

సంగారెడ్డిలో దరఖాస్తు ఫారాల కోసం ఎగబడుతున్న ప్రజలు

సందడి.. సందేహం

మొదటిపేజీ తరువాయి...

చేసుకొన్నారని వెల్లడించారు. ప్రజాపాలనపై ఆమె గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దరఖాస్తు ఫారాలను ప్రజలకు అధికారులు ఉచితంగా ఇవ్వాలని, వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అయితే, ఈ కార్యక్రమంలో తొలిరోజే అనేక చోట్ల గందరగోళం నెలకొన్నది. చాలాచోట్ల దరఖాస్తు ఫారాల కొరత ఏర్పడింది. ఇదే అదనుగా జిరాక్స్ సెంటర్ల యజమానులు ఒక్కో దరఖాస్తు ఫారం జిరాక్స్ తీసేంకు రూ.30 నుంచి రూ.100 వరకు కూడా వసూలు చేశారు. దరఖాస్తు ఫారంలోని అంశాలపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను అధికారులు తీర్చలేకపోవటంతో పలుచోట్ల వాగ్వాదాలు చోటుచేసుకొన్నాయి. కొన్నిచోట్ల కాంగ్రెస్ నేతలే అంతా తామే అయ్యి కార్యక్రమం నిర్వహించటంతో ప్రొటోకాల్ సమస్యలు తలెత్తాయి.

భారీ క్యూలైన్లు

దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం 4 గంటలే సమయం ఇవ్వటంతో మొదటిరోజు చాలాచోట్ల తొక్కిసలాట పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకచోట, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరోచోట దరఖాస్తులు స్వీకరిస్తారని ప్రభుత్వం మొదట ప్రకటించింది. అయితే, తొలిరోజు అనేక చోట్ల ఉదయం ఒకటి రెండు గంటల ఆలస్యంగా కార్యక్రమం ప్రారంభమైంది. అప్పటికే దరఖాస్తు స్వీకరణ కేంద్రాలకు భారీగా చేరుకొన్న ప్రజలు దరఖాస్తు ఫారాల కోసం ఎగబడ్డారు. సమయం మించిపోతే దరఖాస్తులు తీసుకోరేమోనన్న భయంతో పరస్పరం తోసుకొంటూ ఫారాలను త్వరగా తీసుకొని, వివరాలు రాసి ఇచ్చేందుకు పోటీలు పడ్డారు. ఇదే సమయంలో కొన్నిచోట్ల ఫారాలు సరిపోకపోవటంతో అవి అందనివారు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. జిరాక్స్ కాపీలు తెచ్చుకోవాలని అధికారులు సూచించటంతో చాలామంది అటువైపు పరుగులు పెట్టారు. నిజానికి బుధవారమే గ్రామాల్లో ఇంటింటికీ ఫారాలు పంచాలని ప్రభుత్వం మొదట ఆదేశించింది. కానీ, గురువారం అధికారులు దరఖాస్తు ఫారాలను తమ వెంట తెచ్చుకొని ఉదయం 8 గంటల తర్వాతే పంచటంతో చాలాచోట్ల వాటికోసం తోపులాట జరిగింది. మీ సేవా కేంద్రాల్లో పరిస్థితి మరీ దారుణంగా కనిపించింది.

కామారెడ్డి జిల్లా బిచ్కుందలో ఫారాల కోసం జీపీ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

గ్రేటర్‌లో 1.98 లక్షల దరఖాస్తులు

ప్రజా పాలన కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తొలిరోజే 1.98 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. 150 డివిజన్లలో మొత్తం 600 కేంద్రాలను బల్దియా అధికారులు ఏర్పాటు చేశారు. రెండు సెషన్లలో అభయహస్తం దరఖాస్తులను స్వీకరించగా, తొలిరోజున జనాలకు సరిపోయేలా దరఖాస్తులు లభించక ఆందోళన చెందారు. దీంతో ప్రజాపాలన కౌంటర్ల కంటే మీ సేవా, జిరాక్స్ సెంటర్ల వద్దనే జనాలు కిక్కిరిపోయారు. ఇదే అదనుగా జిరాక్స్, మీ సేవా నిర్వహకులు ఒక్కో దరఖాస్తు ఫారానికి రూ.50-100 చొప్పున వసూలు చేసి సొమ్ము చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 141 పట్టన స్థానిక సంస్థ (యూఎల్‌బీ)ల నుంచి తొలిరోజు 81,964 దరఖాస్తులు అందినట్టు అధికారులు వెల్లడించారు. మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి చందన దాసరి, అదనపు డైరెక్టర్ డీ జాన్ శామ్‌సన్ పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం తదితర మున్సిపాలిటీల పరిధిలో పలు ప్రజాపాలన కేంద్రాలను తనిఖీచేసి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబరు- 040-23120410కు ఫోన్ చేయాలని సూచించారు. దరఖాస్తు ఫారం emunicipal.telangana.gov.in వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉన్నదని వివరించారు.

తొలిరోజు 7,46,414 దరఖాస్తులు

- ఉచితంగా దరఖాస్తు ఫారాలు
- విక్రయిస్తే కఠిన చర్యలు: సీఎస్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'ప్రజాపాలన' కార్యక్రమ తొలిరోజైన గురువారం రాష్ట్రవ్యాప్తంగా 7,46,414 దరఖాస్తులు వచ్చినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి 2,88,711 దరఖాస్తులు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుంచి 4,57,703 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంపై ఆమె గురువారం కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతీ కేంద్రంలోనూ సరిపడా అభయహస్తం దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలని, వాటిని ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. గ్రామసభలకు వచ్చేవారికి మంచినీటి వసతి కల్పించడంతోపాటు క్యూలైన్లు పాటించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రతీ వంద మందికి ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక నెంబర్ ఇవ్వాలని, ఫారాలను నింపడానికి, ఇతర అవసరాలకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. సమీక్షలో మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులు దాన కిషోర్, సందీప్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

అసమగ్రంగా దరఖాస్తు ఫాం

నా పేరు బొమ్మకంటి జ్యోతి. మాది రాయికల్ పట్టణం. పిల్లల చదువుల కోసం ఆరేండ్ల క్రితం జగిత్యాల పట్టణానికి వచ్చి కిరాయి ఇంట్లో ఉంటున్నాం. మా అబ్బాయి ఇంటర్, కూతురు పాలిటెక్నిక్ చదువుతున్నారు. మాకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు అన్నీ రాయికల్‌లోనే ఉన్నాయి. కానీ అక్కడ కూడా సొంత ఇల్లు లేదు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసేందుకు రాయికల్ వచ్చాను. అయితే గృహజ్యోతి (200 యూనిట్ల లోపు విభాగానికి సంబంధించి) పథకానికి దరఖాస్తు చేయలేదు. నేను ఉండేది కిరాయి ఇంట్లో కాబట్టి గృహజ్యోతికోసం దరఖాస్తు చేయలేకపోయాను. నా కూతురుకు 18 ఏండ్లు నిండాయి. ఆమెకు సైతం మహాలక్ష్మి పథకానికి అర్హత ఉన్నది. ఆమెకు కూడా పథకాన్ని వర్తింపజేయాలి.

అనేక ప్రశ్నలు

- ఫారంలో బ్యాంకు అకౌంట్ నంబర్ నమోదుకు అవకాశం ఇవ్వలేదు. దీంతో పథకాలు ఎలా అమలు చేస్తారంటూ అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మహిళలకు ప్రతినెలా రూ.2500 సాయం, రైతుభరోసా సాయం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల సాయం కింది అర్హులకు ఆ మొత్తాన్ని బ్యాంకులో నగదు బదిలీ పద్ధతిలో జమ చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు దరఖాస్తులో అకౌంట్ నంబర్‌కు కాలం లేకపోడంతో ప్రజలంతా విస్మయం వ్యక్తం చేశారు. ఈ హామీలను ఏ విధంగా అమలు చేస్తారని మొదటిరోజే అధికారులను ప్రజలు నిలదీశారు. సమాధానాలు చెప్పలేక అధికారులు కూడా చేతులెత్తేశారు.
- ఒక ఇంట్లో ఎంత మంది మహిళలు ఉంటే అందరికీ రూ.2500 ఇస్తారా? లేక ఒక్కరికే ఇస్తారా? అని మహిళలు ప్రశ్నించారు. భర్తకు పింఛన్ వస్తే భార్యకు ఇవ్వరా? అని అధికారులను అడగడం కనిపించింది. రేషన్‌కార్డుల్లో తల్లీకూతుళ్ల పేర్లుండి, కూతురి పెళ్లయిపోతే అత్తగారింటి వద్ద మహాలక్ష్మి డబ్బులు జమ చేస్తారా? లేక తల్లిగారింటి వద్ద దరఖాస్తు చేసుకోవాలా? అన్న ప్రశ్నలు వినిపించాయి.
- ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, వితంతు తదితర పెన్షన్ తీసుకుంటున్న మహిళలకు కూడా అదనంగా 2500 ఇస్తారా? లేక ఏదైనా ఒక్క పెన్షన్ మాత్రమే ఇస్తారా? అన్న సందేహాలను మహిళలు వ్యక్తం చేశారు.
- కౌలు రైతుల కాలమ్‌కు సంబంధించి సాగు చేస్తున్న భూమి సర్వే నంబర్‌తో పాటు పాసు పుస్తకం వివరాలు కూడా దరఖాస్తులో ఇవ్వాల్సి ఉంటుంది. కానీ భూ యజమానితో అధికారిక ఒప్పందం లేకుంటే సదరు వివరాలను ఏ విధంగా నమోదు చేయాలని పలువురు కౌలు రైతులు అధికారులను ప్రశ్నించారు.
- ఉపాధి హామీలో రైతు కూలీగా జాబ్ కార్డు ఉంటేనే ఏడాదికి ఇచ్చే రూ.12 వేల కోసం దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తులో ఉన్నది. దీంతో జాబ్‌కార్డులు లేని కూలీలు దరఖాస్తు కౌంటర్ల వద్ద అధికారులతో గొడవపడటం కనిపించింది.
- సిలిండర్ల రాయితీపై కూడా స్పష్టత లేదు. ఎన్ని సిలిండర్లకు రాయితీ ఇస్తారన్నది చెప్పకుండా ఏటా ఎన్ని సిలెండర్లు వాడుతున్నారని ఫారంలో ప్రశ్న అడిగారు. దీంతో ఎన్ని సిలిండర్లు వాడితే అన్నింటికి రాయితీ ఇస్తారా? లేక కొన్నింటికి మాత్రమే రాయితీ ఇస్తామని ప్రభుత్వం చెప్పున్నదా? అంటూ అధికారులను దరఖాస్తుదారులు అడగడం కనిపించింది.
- ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వడానికి సంబందించి దరఖాస్తులో పోలీసు ఎఫ్ఐఆర్ నంబర్ (ఎఫ్ఐఆర్), జైలుకు వెళ్లిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. అంటే, తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లకుండా శాంతియుతంగా రోజుల తరబడి దీక్షలు చేసినవారికి గుర్తింపు లేదా? అని పలువురు ఉద్యమకారులు ప్రశ్నించారు.
- 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇచ్చే అంశంపై ప్రజల్లో అనేక సందేహాలు కనిపించాయి. అద్దె ఇండ్లలో ఉండేవారికి తమ పేరుతో కనెక్షన్ ఉండదు. మరి యజమానికి ఉచిత విద్యుత్తు వస్తుందా? కిరాయికి ఉండేవాళ్లకు వస్తుందా? అని చాలా మంది ఆరా తీశారు. 200 యూనిట్లపైన వాడుకునే విద్యుత్తుకు మాత్రమే బిల్లు చెల్లించాలా? లేక 200 యూనిట్లు దాటితే మొదటి యూనిట్ నుంచి మొత్తం కలిపి బిల్లు వేస్తారా? అని దరఖాస్తుదారులు ప్రశ్నించారు.
- రేషన్‌కార్డులు లేకపోవడంతో తాము ఎలా దరఖాస్తు చేయాలంటూ అధికారులను అడగడం కనిపించింది. ఆధార్‌కార్డు ఉన్నా దరఖాస్తులు తీసుకుంటామని కొంతమంది చెప్పగా.. రేషన్ కార్డు లేకపోతే దరఖాస్తులు తీసుకోబోమని మరికొన్నిచోట్ల అధికారులు, ప్రభుత్వం సిబ్బంది చెప్పడం కనిపించింది.
- దరఖాస్తు ఫారాలు దొరకక జిరాక్స్ సెంటర్ల చుట్టూ ప్రజలు తిరగడం కనిపించింది. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దరఖాస్తు ఫారాలను తమకు సంబంధించిన వారికి మాత్రమే పంచుకొన్నారనే విమర్శలు వినిపించాయి.
- దరఖాస్తు చేసేందుకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల అవసరం లేకపోయినా కొన్నిచోట్ల అధికారులు ఆయా పత్రాలు కావాలని చెప్పడంతో ప్రజలు వాటి కోసం పరుగులు తీశారు.
- ఇప్పటికే రైతుబంధు తీసుకుంటున్నవారు కూడా రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలా? అని రైతులు ప్రశ్నించారు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు.
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో ఏపీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన వారు తమ ఆధార్‌కార్డులు తీసుకొని రావడం కనిపించింది. తెలంగాణలో చిరునామా లేదంటూ వారిని తిప్పి పంపారు. కొన్ని సెంటర్లలో ఆధార్‌కార్డు ఎక్కడ ఉన్నా దరఖాస్తులు తీసుకున్నారు.
- తొలిరోజు చాలాచోట్ల ప్రొటోకాల్ వివాదం చెలరేగింది. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ నేతలే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తాను కార్యక్రమ ప్రారంభోత్సవానికి వస్తున్నట్టు చెప్పినప్పటికీ తూప్రాన్ మండలంలో ఆర్డీవో జయచంద్రారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో కార్యక్రమ ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యేల ఫొటోలు పెట్టకుండా మంత్రులవే పెట్టుకున్నారు.

అర్హత ఆధారంగానే ఆరు గ్యారెంటీలు

- ఇతర పార్టీలనే వివక్ష ఉండదు
- ప్రతి దరఖాస్తును భద్రపరుస్తాం
- ప్రజాపాలన ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 28: అర్హత ఆధారంగానే అందరికీ ఆరు గ్యారెంటీలు అందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాజకీయాలకతీతంగా, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా భట్టి మాట్లాడారు. తెలంగాణ ఆకాంక్ష నెరవేర్చడం కోసం ఇందిరమ్మ పాలనకు ప్రజలు శ్రీకారం చుట్టారని, వారి నమ్మకాన్ని నిజం చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్టు పేర్కొన్నారు. మిగిలిన నాలుగు గ్యారెంటీలను కూడా ప్రజా పాలన కార్యక్రమాల ద్వారా ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లోని వార్డుల వారీగా గ్రామ సభలు నిర్వహించి, దరఖాస్తులు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ దరఖాస్తులన్నింటిని భద్రపరిచి, త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్హులను గుర్తిస్తామని తెలిపారు. గురువారం నుంచి జనవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ప్రతి దరఖాస్తును పరిశీలిస్తామని, రశీదు ఆధారంగా తమ దరఖాస్తు ఎక్కడుందో తెలుసుకోవచ్చని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతుభరోసా వంటి పథకాలను అందిస్తామని చెప్పారు. దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రతి గ్రామంలో వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటుచేశామని, ప్రతి కౌంటర్‌కు అధికారులను నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్ గౌతమ్ పోట్రు, స్పెషల్ ఆఫీసర్ సౌమ్య పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో అవకతవకలు

- రూ.2.10 కోట్ల చేతివాటం
- గచ్చిబౌలిలో ముగ్గురిపై కేసు

శేరిలింగంపల్లి, డిసెంబర్ 28: గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీలో అవకతవకలకు పాల్పడిన ముగ్గురిపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో లోలోన ది లైవ్ స్టార్ కంపెనీ పేరిట సయ్యద్ మొయిజ్ కాంట్రాక్టర్‌గా చెలామణి అవుతున్నాడు. శేరిలింగంపల్లి, కొండాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. పశుసంవర్ధకశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న రవికుమార్, కేశవసాయితో కలిసి గొర్రెల పంపిణీ సేకరణలో భాగంగా ఆగస్టు 13 నుంచి 23 వరకు ఏపీలోని పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పర్యటించారు. అక్కడి 18 రైతుల నుంచి 133 యూనిట్ల గొర్రెలను వీరు కొనుగోలు చేశారు. ఈ కాంట్రాక్టును లోలోన కంపెనీకి దక్కించుకొన్నది. పశుసంవర్ధకశాఖలో అర్హులైన రైతుల ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ల నంబర్లు సేకరించి వారిస్థానంలో ఫేక్ అకౌంట్లు సృష్టించి మొయిజ్ డబ్బులు పంపిణీ చేసినట్టు చూపిస్తూ నిధులు దారి మళ్లించాడు. దాదాపు రూ2.10 కోట్ల అవకతవకలకు పాల్పడ్డాడు. గొర్రెల విక్రయానికి సంబంధించి రైతులు డబ్బుల కోసం నిరీక్షించి పశుసంవర్ధక కార్యాలయానికి సంప్రదించారు. తమకు చెల్లించాల్సిన నగదును బినామీ ఖాతాల్లోకి దారి మళ్లించినట్టు గుర్తించిన బాధిత రైతులు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు మొయిజ్‌తోపాటు అసిస్టెంట్ డైరెక్టర్లు రవికుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేశారు.

సింగరేణి సంపదను కాపాడుకుందాం

- ప్రతి కార్మికుడికి సొంతిల్లు, సౌకర్యాల కల్పనకు కృషి
- యూనియన్ నేతలు కూనంనేని, వాసిరెడ్డి, రాజ్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంపద తరలిపోకుండా కాపాడుకుందామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు, అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీకి పట్టంగట్టిన కార్మికులందరికీ ఒక ప్రకటనలో వారు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో సింగరేణిని బతికుంచుకోవాలనే పట్టుదలతో ఏఐటీయూసీని సుమారు 3 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి పరిధిలో కొత్త మైన్స్‌ను తీసుకరావడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. మైన్స్ ప్రైవేట్‌పరం కాకుండా, సింగరేణి పరిధిలోనే ఉండేలా పోరాడుతామని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడికి సొంతిల్లు, ఇతర సౌకర్యాల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి సంపదను దారిమళ్లించి, దుర్వినియోగం చేసిన అధికారులపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ విజయానికి పాటుపడిన ప్రతిఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

గ్యారెంటీల దరఖాస్తు ధర రూ.100!

కౌంటర్ల వద్ద అప్లికేషన్ల కొరత

ఇదే అదనుగా రెచ్చిపోయిన దళారులు

రూ.50, రూ.100 అంటూ అమ్మకాలు

- దరఖాస్తుదారుల జేబులకు చిల్లులు
- కౌంటర్ల వద్ద కన్నా జిరాక్స్ సెంటర్లు, మీసేవ సెంటర్ల వద్దే అధికంగా ప్రజలు
- చేతులెత్తేసిన జీహెచ్ఎంసీ అధికారులు
- దరఖాస్తుల స్వీకరణలోనూ గజిబిజి
- ఒక్క దరఖాస్తులో అనేక సందేహాలు
- గందరగోళంగా తొలిరోజు ప్రజాపాలన

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలనలో ప్రజలకు సేవ అటుంచితే దరఖాస్తుదారుల జేబులకు చిల్లులు పడ్డాయి. ఒక్కో వార్డులో నాలుగు కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఒక రోజు ముందుగానే దరఖాస్తు ఫారాలను అందజేస్తామన్న జీహెచ్ఎంసీ అధికారులు.. క్షేత్రస్థాయిలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. ఒక్కో కేంద్రంలో వందల సంఖ్యలోనే దరఖాస్తు ఫారాలు అందజేయగా, తొలి రోజే వేల సంఖ్యలో దరఖాస్తుదారులు కేంద్రాలకు పోటెత్తారు. అరకొరగా తీసుకువచ్చిన కలర్ పేపర్లతో కూడిన దరఖాస్తులు ప్రతి కేంద్రంలో మొదటి గంటలోనే అయిపోవడంతో జిరాక్స్ కాపీలను పంపిణీ చేశారు. అవి కూడా అయిపోవడంతో జిరాక్స్ సెంటర్లకు వెళ్లి తీసుకోవాలని సిబ్బంది ప్రజలకు తెలియజేయడం కనిపించింది. ఇదే అదనుగా భావించిన కొందరు దళారులు ఒకో దరఖాస్తు ఫారాన్ని రూ.40-రూ.50 తీసుకుని ఇచ్చారు. మరోవైపు, దరఖాస్తుల కోసం మీసేవ, జిరాక్స్ సెంటర్ల వైపు ప్రజలు దారులు పట్టారు. సందట్లో సడేమియాలా మీసేవ సెంటర్ల నిర్వాహకులు, జిరాక్స్ సెంటర్లు, కొన్నిచోట్ల కిరణాషాపు యాజమానులు బ్లాక్ దందాకు తెరలేపారు. ఒక్కో దరఖాస్తుకు రూ.50 నుంచి 100 వరకు దరఖాస్తుదారులు సమర్పించుకోవాల్సి వచ్చింది.

ఒక్క ప్రింట్‌కు రూ.40!

దరఖాస్తులు జిరాక్స్ సెంటర్లు, మీసేవ సెంటర్ల పంట పండించాయి. గ్యారెంటీ దరఖాస్తులకు రేషన్‌కార్డు, ఆధార్ పత్రాలు జతచేయాలని ప్రభుత్వం స్పష్టం చేయటంతో జిరాక్స్ సెంటర్ల వద్ద జనాలు క్యూకట్టారు. ప్రజాపాలన కౌంటర్ల వద్ద కంటే జిరాక్స్ సెంటర్లు, మీసేవ సెంటర్ల వద్దే దరఖాస్తుదారులు ఎక్కువగా కనిపించారు. దొరికిందే చాన్స్ అన్నట్టు నిర్వాహకులు ధరలు ఆమాంతం పెంచేసి దండుకున్నారు. ఒక్కో ప్రింట్‌కు రూ.20-రూ.40 వరకు దండుకున్న పరిస్థితి. చేసేదేం లేక దరఖాస్తుదారులు సమర్పించుకున్నారు.

మార్గదర్శకాలు లేక ఎన్నో అనుమానాలు

ప్రజాపాలనలో తొలిరోజు.. దరఖాస్తు నింపటమే దరఖాస్తుదారుడికి చిక్కుముడిలా మారింది. అప్లికేషన్ ఎక్కడ చేసుకోవాలి? మొదలు అందులో ఉన్న ప్రతి అంశం సవాల్‌గా మారింది. ఆరు గ్యారెంటీల్లో ఏ పథకానికి అర్హులు, సరైన విధి విధానాలు పొందుపర్చకుండా ఆధార్ కార్డు, రేషన్ కార్డు మెలిక ఒకవైపు, దరఖాస్తుఫారాలు ఇవ్వకుండా దరఖాస్తు చేసుకోవాలా? అన్న ప్రశ్నలతో ప్రజల్లో ఆందోళన కనిపించింది. రేషన్ కార్డు ఉన్నదా? ఆధార్ కార్డులో అడ్రస్ ఇక్కడే ఉన్నదా? రేషన్ కార్డు లేకుంటే స్కీమ్స్ రావు.. రేషన్ కార్డు కోసం తెల్లకాగితంలో రాసివ్వండి.. ఒక కుటుంబంలో ఒకటే స్కీమ్.. అంటూ దరఖాస్తుదారులకు అధికారులు చుక్కలు చూపించారు. దరఖాస్తులు ఎలా నింపాలో, రేషన్‌కార్డుల కోసం ఎవర్ని అడగాలో తెలియక అయోమయానికి గురయ్యారు. ఏ పథకానికి ఏ అర్హత ఉంటుందో? ఎలా ఎంపిక చేస్తారో? అన్న గైడ్‌లైన్స్ ఇవ్వకుండా దరఖాస్తులను తీసుకుంటున్న తీరు విస్మయానికి గురి చేస్తున్నది.

దరఖాస్తుదారులు లేవనెత్తిన సందేహాలివే..

- దరఖాస్తు ఫారంతో ఆధార్, రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో.. రేషన్‌కార్డు లేని పేదలంతా దరఖాస్తు ఎలా చేయాలని బాధపడ్డారు. కొందరైతే పుడ్ సెక్యూరిటీ కార్డు కోసం దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేకపోవటంతో తెల్లకాగితంపై దరఖాస్తు చేశారు.
- అభయహస్తం దరఖాస్తు ఫారాలు తెలుగులోనే ఉండగా.. ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ మాధ్యమాల్లో దరఖాస్తులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
- దరఖాస్తు చేయడానికి ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న వేళ రోడ్లపైకి వచ్చి క్యూ లైన్లో నిల్చొని టైం వృథా చేసుకునే విధానం అవసరం లేదనే డిమాండ్ వినిపించాయి.
- హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకుంటే.. ఊర్లో ఉన్న పొలాలకు రైతుభరోసాకు మరోసారి దరఖాస్తు చేసుకోవాలా? అనే ప్రశ్నకు సిబ్బంది, అధికారులు ఏమి చెప్పలేకపోయారు.
- దరఖాస్తులో విద్యార్థులకు రూ.5 లక్షల వడ్డీలేని రుణాల ప్రస్తావన లేదని, దానిగురించి మరోసారి దరఖాస్తు చేసుకోవాలా? అన్న ప్రశ్నకు అధికారులు పెదవి విరిచారు.
- ఇప్పటికే ఆసరా పింఛను పొందుతున్నవారు మళ్లీ దరఖాస్తు చేయనవసరం లేదని అధికారులు క్లారిటీ ఇచ్చినప్పటికీ కొన్ని చోట్ల వృద్ధులు, మహిళలు భారీగా కౌంటర్ కేంద్రాలకు తరలివచ్చి అవస్థలు ఎదుర్కొన్నారు.

ఇల్లెవరికి ఇస్తరు?

- ఇందిరమ్మ ఇండ్లపై కోటి ఆశలు!
- ఇంటి స్థలాలు ఉన్నవారే 15.50 లక్షల మంది
- దరఖాస్తులు వచ్చాకే స్పష్టత వచ్చే అవకాశం
- ఇంకా సిద్ధంకాని ప్రభుత్వ మార్గదర్శకాలు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల పథకంపై ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు లక్షల మంది ప్రజలు సిద్ధంగా ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన 'గృహలక్ష్మి' పథకానికే దాదాపు 15.5 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం జాగ ఉన్నవారికి ఇంటి కోసం రూ.5 లక్షలు, జాగ లేనివారికి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రకటించడంతో ఎన్ని దరఖాస్తులు వస్తాయో అనేది అంచనాకు దొరకడంలేదని అధికారవర్గాలు చెప్తున్నాయి. లబ్ధిదారుల ఎంపిక ఎలా అనే దానిపై ఇంకా మార్గాదర్శకాలు కూడా సిద్ధం కాలేదు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలకు సంబంధించి గురువారం నుంచి దరఖాస్తుల స్వీకరణకు సన్నాహాలు చేస్తున్నది. ఇందులో ఇందిరమ్మ ఇండ్ల అంశం అత్యంత ప్రధానమైనదిగా చెప్పవచ్చు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకోసం డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టిన విషయం విధితమే. జాగలు ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికోసం రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన గృహలక్ష్మి పథకానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు కేటాయించిన గత సర్కారు, దరఖాస్తులు ఆహ్వానించగా, 15,58,610 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సుమారు 11 లక్షల దరఖాస్తులకు అర్హతలున్నట్టు గుర్తించారు. ఇ